బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

విశాలాంధ్ర-మందస: బడి ఈడు బాల బాలికలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మండలం పొత్తంగి సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. విశ్వనాథం అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఉపాధ్యాయులతో కలిసి మాకన్నపురం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మద్దిల నాగేశ్వరరావును కలిసి గ్రామంలో బడి ఈడు పిల్లలుంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉచిత పుస్తకాలు, ఏకరూప దుస్తులు, మధ్యాహ్నభోజనం వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కరుణాకర్, సోమనాథ్, సింహాచలపతి, సుశాంత్‌కుమార్, ఢిల్లీరావు, కామేశ్వరరావులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర-మందస: మండలం హరిపురం సమీపంలో గల పాత జాతీయ రహదారిలో నివాసముంటున్న పొందూరు బాలక్రిష్ణ (34) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబంలో వచ్చిన కలతలకు మనస్థాపం చెందిన ఈ చర్యకు పాల్పడ్డాడని, కుటుంబ సభ్యులు తెలిపారు. బాలక్రిష్ణకు భార్య మాధురితో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంత కాలంగా భార్యతో వేరుగా నివాసముంటున్నారు. ఈ సంఘటనపై మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ప్రమాదంలో 59 గొర్రెలు, మేకలు మృతి : రూ.5లక్షల ఆస్తి నష్టం

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ తాళ్లభద్ర రైల్వే గేటు సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రైల్వే ప్రమాదంలో తాళ్లభద్ర గ్రామానికి చెందిన కిక్కర కామయ్య, జయరామచంద్రపురం గ్రామానికి చెందిన కిక్కర సోమేశ్వరరావు, ఉదయపురం గ్రామానికి చెందిన బద్రి సింహాద్రికి చెందిన 59 గొర్రెలు, మేకలు మృతి చెందాయి. బాధితులు, పశుసంవర్ధక శాఖా అధికారులు అందించిన వివరాలిలా ఉన్నాయి. కిక్కర కామయ్య, కిక్కర సోమేశ్వరరావు, బద్రి సింహాద్రి సుమారు 300 గొర్రెలు, మేకలు పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీలో నీలాపురంలో మంద వేశారు. అనంతరం గొర్రెల యాజమానులు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. బుధవారం అర్ధరాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షంతో పాటు సమీపంలో పిడుగు పడింది. దీంతో మందలో ఉన్న మేకలు, గొర్రెలు భయభ్రాంతులకు గురై చెల్లాచెదురుగా వెళ్లిపోయాయి. ఆ సమయంలో దారి తప్పిన కిక్కర సోమేశ్వరరావుకు చెందిన 49, బద్రి సింహాద్రికి చెందిన 5, కిక్కర కామయ్యకు చెందిన 5 గొర్రెలు, మేకలు తాళ్లభద్ర రైల్వే పట్టాలపైకి రావడంతో గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ విషయాన్ని తాళ్లభద్ర గ్రామస్తులు గొర్రెల పెంపకందారులకు సమాచారం అందించారు. అప్పటికే రైలుపట్టాలకు ఇరువైపులా మృతి చెందిన గొర్రెలు, మేకలను చూసి పెంపకందారులు లబోదిబోమంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న పశుసంవర్ధక శాఖా అధికారులు ఘనట స్థలానికి చేరుకొని మృతి చెందిన గొర్రెలు, మేకలకు పోస్టుమార్టం నిర్వహించి సమీప ప్రాంతంలో ఖననం చేశారు. సుమారు 5 లక్షల రూపాయలు ఆస్తి నష్టం వాటిల్లిందని వారు తెలిపారు.

వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : రైతులు వ్యవసాయ యంత్రాలు ఉపయోగించి వ్యవసాయ ఉత్పత్తులను పెంచాలని పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. గురువారం సన్నకారు రైతులకు వైఎస్ఆర్ యంత్ర సేవా పథకాలు ద్వారా వ్యవసాయ పనిముట్లును అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ వ్యవసాయ పనిముట్లు ఉపయోగించు కోవాలని, వీటిని ఉపయోగించి అధిక వ్యవసాయ ఉత్పత్తులు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో లోకనాద్ బెమరా, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

దూరదర్శిని సీనియర్ జర్నలిస్ట్ జోగినాయుడుకి హెల్పింగ్ హ్యాండ్స్ సత్కారం

విశ్వాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : జర్నలిజం రంగంలో తనదైన శైలిలో ముద్ర వేసుకోని సమాజానికి అద్భుతమైన సేవలు చేస్తున్న దూరదర్శని సీనియర్ జర్నలిస్ట్ ఏపీజెఎఫ్ రాష్ట్ర సెక్రటరీ యస్.జోగి నాయుడుకి హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నాడు సత్కారం. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సకలాబత్తుల వెంకట్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా కు చెందిన దూరదర్శిని సీనియర్ జర్నలిస్ట్, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర సెక్రటరీ జోగి నాయుడు ఒక వైపు సమాజానికి ఉపయోగపడే కథనాలు ప్రచురణ చేస్తూ మరో వైపు రాష్ట్రంలో ఉన్న జర్నలిస్టులు సంక్షేమానికి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని వెంకట్ అన్నారు. దూరదర్శిని సీనియర్ జర్నలిస్ట్ ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్ ఫోరమ్ రాష్ట్ర సెక్రటరీ జోగి నాయుడు మాట్లాడుతూ గన్నవరం ప్రాంతంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో పేదలకు దివ్యాంగులకు వృద్ధులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నారని, స్పందన మానసిక వికాస కేంద్రం లో దివ్యాంగులకు ఉచితంగా విద్యా వైద్య రవాణా భోజన సౌకర్యాలు కల్పించడంలో పాటు నిరంతరం దివ్యాంగుల సంక్షేమానికి అభివృద్ధికి కృషి చేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ సేవలకు నాయుడు ప్రసంశించారు. జిల్లా లో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో చేస్తున్న సేవాకార్యక్రమాలకు అండగా ఉంటూ భాగస్వామ్యం అవుతామని జోగి నాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ ఇ.సి.మెంబర్ కాటం రవిబాబు,జర్నలిస్ట్ కె.శ్రీనివాస్,హర్షిత డెవలప్‌మెంట్ కె.దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాడీ బిల్డర్ల సత్తా

గోపాల్ ఫిట్ నెస్ అధినేత అభినందన

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: పాడేరు లో ఈ నెల 15న జరిగిన మిస్టర్ ఆంధ్ర బాడీ బిల్డింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో శ్రీకాకుళం ప్రాతినిధ్యం వహించిన బిల్డర్లు సత్తా చాటి పతకాలు కైవసం చేసుకున్నారని ఏపీ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ వి.విజయ్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు బుధవారం గోపాల్ ఫిట్ నెస్‌లో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గోపాల్ ఫిట్ నెస్ అధినేత గోపాల్ హాజరై విజేతలను అభినందించారు. 55 కేజీల లో ప్రథమ స్థానం అరుగుల జ్యోతి కుమార్, 55 కెజీల ఎస్‌కె అబ్దుల్ ఖాన్ మూడవ స్థానం శ్రీకాకుళం 65 కెజీ లో బట్న నవీన్ కుమార్ ప్రథమ స్థానం ఒప్పంగి 65 కెజీ షేక్ మదీనా నాలుగో స్థానం రణస్థలం 75 కెజీ ఎస్. సందీప్ కుమార్ మూడువ స్థానంలో నిలిచారు. ఈకార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు బి ప్రసాద్ టీమ్ మేనేజర్ కే గౌరీ శంకర్ ఆమదాలవలస ప్రత్యేక అభినందనలు తెలిపారు.

జీడి మామిడి రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-కవిటి: ఇటీవల కురిసిన అకాల వర్షాలు,ఈదురు గాలులు ప్రభావంతో జీడి, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఆదుకొని తగిన న్యాయం చేయాలని మండల కేంద్రమైన కవిటి తాసిల్దార్ కార్యాలయంలో ఇచ్చాపురం నియోజకవర్గం జనసేన నాయకులు లోళ్ల రాజేష్ డిప్యూటీ తహసిల్దార్ రామచంద్రరావుకు, సర్వే డిటి బలివాడ ఈశ్వరరావుకు కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ ఇటీవల వీచిన ఈదురు గాలుల ప్రభావంతో మండలంలోని కొన్ని గ్రామాలలో మామిడి పంటకు అపార నష్టం జరిగిందని తెలిపారు. ఉద్దాన ప్రాంతంలో విస్తారంగా పండిస్తున్న జీడి పంటకు మద్దతు ధర లేక రైతులు నానా అవస్థలు పడి చివరికి తక్కువ ధరకు దళారులకు విక్రయించాల్సి వస్తుందని అన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం జీడి పిక్కలకు మద్దతు ధర కల్పించి రైతులకు ఆదుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు ప్రశాంత్,కాళీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి వచ్చి మృత్యువాత పడుతున్న చుక్కల దుప్పులు

విశాలాంధ్ర-పాతపట్నం: వేసవి తాపాన్ని తట్టుకోలేక నీటి కోసం జనావాసాల మధ్యకు వచ్చిన చుక్కల దుప్పి కుక్కల దాడిలో గాయపడింది. పాతపట్నం షిరిడి గిరి సమీపంలో ఉన్న కస్తూరిబా పాఠశాల దగ్గరలో గాయయాల తో ఉన్న చుక్కల దుప్పిని స్థానికులు రక్షించి అటవీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం తెలుసుకున్న పాతపట్నం అటవీ శాఖ అధికారి రౌతు. రాజశేఖర్, పాతపట్నం అటవీ సెక్షన్ అధికారి సంఘటనా స్థలానికి చేరుకుని చుక్కల దుప్పికి ప్రథమ చికిత్స చేసి, అనంతరం అంతరాబ రిజర్వ్ ఫారెస్ట్‌లో విడిచిపెట్టారు. గడచిన రెండు నెలల్లో ఎన్నో చుక్కల దుప్పిలు మృత్యువాత పడుతున్న ఘటనలు పునరావృతం అవుతున్నప్పటికి అటవీ అధికారులు వన్య ప్రాణులను సంరక్షించడం లో అలసత్వం వహిస్తున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వయోవృద్ధుడికి ఆశ్రయం కల్పించిన సీతయ్య ఫౌండేషన్

విశాలాంధ్ర-కవిటి : కంచిలి మండలం మండపల్లి గ్రామ శివారులలో గల సీతయ్య ఫౌండేషన్ వాన ప్రస్తానాశ్రమం స్వచ్ఛంద సంస్థ వారు బొరివంక గ్రామ%శీ% కు చెందిన కొత్తపల్లి నరసింహమూర్తి అనే 67 సంవత్సరాల వయోవృద్ధుడను గురువారం ఆశ్రయం కల్పించారు. విధి వక్రించి ఒంటరైన వృద్ధుడు పొట్టకూటి కోసం కొన్ని సంవత్సరంలు సుదూర ప్రాంతాల్లో శ్రమపడుతూ రోజులు గడిపేవాడు.వృద్ధాప్యం లో శరీరం సహకరించక కవిటి గ్రామానికి చేరుకున్నాడు.అన్న పానాలు లేక గుడి,బడి, విశ్రాంత ప్రాంగణాల్లో రోజులు గడుపుతున్న పరిస్థితిని స్థానిక వైద్యులు పూడి రామారావు, బి వి కే పాఠశాల ఉపాధ్యాయులు సతీష్ ద్వారా తెలుసుకొని వెంటనే స్పందించి కొత్తపల్లి నరసింహమూర్తి అనే వయోవృద్ధుడను సీతయ్య ఫౌండేషన్ వాన ప్రస్థాన ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు.ఈ మేరకు స్వచ్ఛంద సంస్థ వారు అన్నదాన వస్త్రదాన సేవలు అందించి ఆశ్రయం కల్పించినట్లు సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుళ్ల రమేష్,గుళ్ల మోహనరావులు తెలిపారు.ఈ సందర్భంగా వయోవృద్ధుడుకు ఆశ్రమ దరిచేర్చి వృద్ధిని సేవలో భాగస్వామ్యం పంచుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ మిత్రుడు కాళీ సాహు (బొరివంక),ఉషోదయ యువజన సంఘం సభ్యులకు(కవిటి)సహచర సభ్యులు సోంపేట కు చెందినసానా గణేష్ (కన్నా)కు సీతయ్య ఫౌండేషన్ తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం బారువ గ్రామంలో ఇటీవల మహేంద్రతనయ నదిలో మునిగి తండ్రి కొడుకులు మరణించిన సంఘటనలో ఆ కుటుంబం పడుతున్న వేదన ఎన్నటికీ తీరనిదని ఈ ఘోరం మరో కుటుంబానికి జరగకూడదని సీడాప్ రాష్ట్ర చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు పేర్కొన్నారు. ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించి 5వేల రూపాయల ఆర్థికసాయం అందించి కుటుంబాన్ని ఓదార్చారు. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన అని అన్నారు. ఇటువంటి నదిపై చిన్నపాటి వంతెన ఉన్నా ఇంత ప్రమాదం జరిగేది కాదని అన్నారు. దశాబ్దాలుగా ఈ సమస్యను నాయకులెవ్వరూ సమర్థంగా ప్రయత్నించలేదని అన్నారు. ఆ కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం కలిగించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నేతలు కూడా పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

- ఈవీఎం గొడౌన్లు సిద్ధం చేయాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

విశాలాంధ్ర-శ్రీకాకుళం: రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితాలకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా జిల్లా కలెక్టర్లను కోరారు. గురువారం జిల్లా కలెక్టర్లు, సంయుక్త కలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవిఎం గొడౌన్లకు మరామ్మతులు చేయించవలసి ఉంటే వాటిని వెంటనే బాగుచేయించి సిద్ధం చేయాలని అన్నారు. ఈవిఎంల సరఫరాను జూన్ నుండి ప్రారంభించి సెప్టెంబర్ మాసం నాటికి పూర్తిస్థాయిలో అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈవిఎం లపై సిబ్బందికి శిక్షణ చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. ఎపిక్ కార్డుల పంపిణీ, ఈ.ఆర్.ఓ నెట్ -2పై ప్రచారం నిర్వహించాలని అన్నారు. జిల్లాలో ఓటర్ల నమోదు కార్యక్రమానికి సంబంధించి కొత్తగా నమోదు చేయాల్సిన ఓటర్ల వివరాలతో పాటు తొలగించాల్సిన ఓటర్ల వివరాలను కూడా మరోమారు పరిశీలించి జాబితాను సరిచేయాలని చెప్పారు. జిల్లాల వారికి అప్పగించిన లక్ష్యాలను సకాలంలో పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎపిక్ ద్వారా సరఫరా ప్రక్రియ జరగాలని, స్వీకరించిన దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 25లోగా ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. పూర్తిచేసిన వివరాలను జెని లాగిన్ నందు ఉంచాలని ఆయన స్పష్టం చేశారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్, సంయుక్త కలెక్టర్ యం.నవీన్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గౌతును విమర్శించే అర్హత వైసీపీకి లేదు

టీడీపీ జిల్లా కార్యదర్శి విఠల్

విశాలాంధ్ర-పలాస : 60 ఏళ్ల గౌతు కుటుంబ చరిత్ర సంబంధించి వైసీపీ నాయకులు ఎన్నిసార్లు గొంతు చిచ్చుకొని విమర్శించినా ఈ ప్రాంత ప్రజల గుండెల్లో గౌతు చరిత్ర చిరస్థాయిగా లెక్కించిబడిం దని, దీనిని చరపడం వైసీపీ నాయకుల తరం కాదని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా కార్యదర్శి పిరుకట్ల విఠల్, పట్టణ టీడీపీ అధ్యక్షులు బడ్డ నాగరాజులు అన్నారు. గురువారం పలాస టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ పార్టీకి చెందిన చాలా మంది అవివేకులు, వారి నాయకుల మెప్పు కోసం మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఎబ్బెట్టుగా ఉందని అన్నారు. గౌతు కుటుంబాన్ని విమర్శించి నష్టపోయేది వైకాపాయేనని, వజ్రపు కొత్తూరుకు చెందిన ఎంపిపి ప్రతినిధి ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ మతిస్థిమితం లేకుండా గతి తప్పి బీరాలు పలుకుతున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీలో పుట్టి పెరిగి మాజీ ఎమ్మెల్యే శివాజీ బిక్ష పెడితే ఆయన భార్య నీలవేణి జెడ్‌పిటిసి అయిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనేకసార్లు పోటీ చేసి ఒక్కసారి కూడా గెలవలేకపోయావని, రాజకీయ బిక్ష పెట్టిన నాయకత్వానికి పార్టీకి వెన్నుపోటు పొడిచి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వంచన చేరి ఎంపిపి అయ్యావని అన్నారు. వజ్రపుకొత్తూరు మండల అభివృద్ధి టీడీపీ హయాంలోనే జరిగిందని, ఉద్దానం మంచినీటి పథకం, ఎన్‌టిఆర్ సుజల స్రవంతి, నువ్వలరేవు వంతెన, వంకులూరు నడక వంతెన, పూడిలంక రహదారి, వజ్రపుకొత్తూరు ఎంపిడిఓ కార్యాలయం, తుఫాన్ భవనాలు, తారురోడ్లు, ఆఫ్‌షోర్‌కు నిధులు, డయాలసీస్ కేంద్రాలు, ఆసుపత్రి అభివృద్ధి వంటి అనేక కార్యక్రమాలు ఆయన కంటికి కనిపించలేదా అని ప్రశ్నించారు. గతంలో జరిగిన అభివృద్ధిపై ఈ నాలుగేళ్లల్లో వైసీపీ చేసిన అభివృద్ధిపైన మాజీ ఎమ్మెల్యే శివాజీ జీవోలతో సహా ప్రకటిస్తారని వైసీపీ పరిపాలనపై శ్వేతపత్రం విడుదల చేయమని సవాల్ చేస్తే ఎందుకు ముందుకు రాలేకపోయారని ప్రశ్నించారు. అవినీతి ఆరోపణలు తాము చేస్తుంటే వాటికి ఎందుకు సమాధానం చెప్పడం లేదని, సైకో పాలనలో వైసీపీ నాయకులు కూడా సైకోలుగా తయారయ్యాయి నియోజకవర్గాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. మరికొద్ది రోజుల్లో ప్రజలు తగిన తీర్పుతో వైసీపీకి సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి లొడగల కామేష్‌యాదవ్, గురిటి సూర్యనారాయణ, గాలి క్రిష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, జోగ మల్లి, డొక్కరి శంకర్, నాగరాజు, శశిభూషణ, సప్ప నవీన్, సూరాడ మోహన్, కూర్మారావు, రామక్రిష్ణ, సత్యం, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం : మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ అన్ని ప్రాంతాలాభివృద్ధే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో కాలువ వ్యవస్థ, రోడ్లు నిర్మాణాలు చేపట్టామని, త్వరలో పూర్తి అవుతాయని అన్నారు. 100 కోట్ల రూపాయలతో ప్రజల దాహార్తి తీర్చేందుకు మంచినీటి పథకంకు భూమిపూజ చేశామని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికీ అందజేస్తున్నామని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్మోహనరెడ్డి తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైసీపీ నాయకులు హనుమంతు వెంకటరావు, కొంచాడ శ్రీకాంత్, బల్ల శ్రీనివాసరావు, అంబటి ఆనందరావు, మీసాల సురేష్‌లు పాల్గొన్నారు.

కర్ణాటక సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన రెల్ల సురేష్

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : తీవ్ర ఉత్కంఠతకు తెర దించుతూ.. కన్నడ నాట కొత్త సీఎంగా పదవీ బాధ్యతలు అందుకోనున్న సిద్ధరామయ్యకు శ్రీకాకుళం జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేశ్ శుభాకాంక్షలు తెలిపారు. దక్షిణాదిలో ఇదే హవా కొనసాగనుందని అన్నారు. రానున్న కాలాన బీజేపీ విముక్త భారత్ నిర్మాణానికి ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త కదిలి రావాలని పిలుపునిస్తూ ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అదేవిధంగా డిప్యూటీ సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న డీకే శివకుమార్ కు కూడా ఆయన శుభాకాంక్షలు తెలిపారు.

హర్యాన మంత్రిపై పోక్సో చట్టం కింద అరెస్టు చేయాలి

రైతు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో నిరసన ధర్నా

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: మహిళా రెజ్లర్లుపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణను, హర్యానా మంత్రి సందీప్ సింగ్ ను పోక్సో చట్టం క్రింద అరెస్టు చేయాలని, పదవులు నుండి బర్తరఫ్ చేయాలని కోరుతూ మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీబావంగా కార్మిక, రైతు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాలు నాయకులు మాట్లాడుతూ న్యాయం కోసం, గౌరవం కోసం పోరాడుతున్న మహిళా రెజ్లర్లకు ప్రతి ఒక్కరూ సంఘీభావాన్ని తెలియజేయాలని కోరారు. దేశానికి అవార్డులు తెచ్చిపెట్టిన, అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భారత స్టార్ మహిళా రెజ్లర్ల లైంగిక వేధింపులు ఫిర్యాదును నమోదు చేయకుండా తిరస్కరించడం మోడి ప్రభుత్వం యొక్క నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని పోస్కో మరియు పోష్ రెండింటిని తప్పనిసరి చేసే వరకు ఢిల్లీ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్ దాఖలు చేయలేదని అన్నారు. మహిళా మల్లయోధులు ముందుగా జనవరి ఢిల్లీలో నిరసన తెలిపారని, దర్యాప్తుచేసి న్యాయం చేస్తామన్న హామీపై నిరసనను ముగించారని కానీ అమలు కాలేదని, కమిటీ నివేదికను పంచుకోవడానికి ఐఒఎ నిరాకరించిందని, అంతే కాదు దాని సభ్యులు మహిళా రెజ్లర్లను, బహిరంగంగా తక్కువ చేసి, వారి ఫిర్యాదులను రాజకీయం చేస్తున్నారని డబ్ల్యూఎఫ్ఐ చీఫ్, అప్పటి క్రీడా మంత్రి మరియు డబ్ల్యూఎఫ్ఐ ద్వారా నియమించబడిన మరికొందరు కోచ్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డారన్నారు. బ్రిజ్ భూషణ్ పార్లమెంటులో అధికార బిజెపికి ప్రాతినిధ్యం "వహిస్తున్న ఎంపి కావున ప్రస్తుత పాలక యంత్రాంగం నిందితులకు రక్షణ ఇస్తుందని విమర్శించారు. బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ ను వెంటనే అరెస్టు చేసి వారి యొక్క అన్ని రాజకీయ మరియు ప్రభుత్వ పదవుల నుండి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు సీనియర్ నాయకులు భవిరి.కృష్ణమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పి.అప్పారావు, ఎస్.కిశోర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జి.సింహాచలం, ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్షులు సి.హెచ్.రాజు,ఉపాధ్యక్షులు డి.చందు, కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలాకి.ప్రసాద్ సిఐటియు జిల్లా నాయకులు ఎన్.వి.రమణ, అల్లు.సత్యన్నారాయణ, ఎస్.గణపతి, ఎస్.లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకులు పొందూరు.చంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయుకులు కొల్లి.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ కోసం చేసిన లక్ష సంతకాలకు ఎంత ప్యాకేజీ ముట్టింది?

- 16 నెలలు జైల్లో ఎలా ఉండాలని నేర్చుకోవాలా....?
- లక్ష కోట్లు ఎలా దోచుకోవాలని నేర్చుకోవాలా.....?
- నవరత్నాలు పేరుతో ప్రజలను ఎలా మోసం చేయాలని నేర్చుకోవాలా.....?

విశాలాంధ్ర-సరుబుజ్జిలి: జగన్మోహన్ రెడ్డిని చూసి పవన్ కళ్యాణ్ నేర్చుకోవాలని, ప్యాకేజీ స్టార్ అని, తన పార్టీ అభివృద్ధి చేసుకోలేదు అని విమర్శించిన చింతాడ రవికుమార్ కు సరుబుజ్జిలి మండల అధ్యక్షులు పైడి మురళి మోహన్ కౌంటర్ ఇచ్చారు. జగన్మోహన్ రెడ్డిని చూసి పవన్ కళ్యాణ్ ఏం నేర్చుకోవాలి? 16 నెలలు జైల్లో ఎలా ఉండాలని నేర్చుకోవాలా? లక్ష కోట్లు ఎలా దోచుకోవాలని నేర్చుకోవాలా? నవరత్నాలు పేరుతో ప్రజలను ఎలా మోసం చేయాలని నేర్చుకోవాలా సొంత తల్లిని, చెల్లిని మోసం చేసి పక్క రాష్ట్రానికి ఎలా పంపించాలో నేరుచుకోవాలా అన్నారు. షుగర్ ఫ్యాక్టరీ గురించి లక్ష సంతకాలు సేకరించి ఈరోజు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న మీకు లక్ష సంతకాలుకు ఎంత ప్యాకేజీ వచ్చింది...? అని ప్రశ్నించారు. ఈరోజు ఒక పార్టీలో రేపు ఇంకో పార్టీలో వుండే మీరు నియోజకవర్గంలో సమస్యలు తెలుసుకునే నాయకులు ఎప్పుడు అవుతారు అంటూ ఎద్దేవా చేశారు. ముందు నియోజకవర్గంలో ఉండే సమస్యల పరిష్కారం కోసం ఆలోచించండి తర్వాత పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడండి అన్నారు.

ఉరి వేసుకొని ఏఎస్ కవిటి గ్రామ తలయారి మృతి

విశాలాంధ్ర-పాతపట్నం: మండలం, హరిజన గోపాలపురం గ్రామానికి చెందిన కుంచెల రాంబాబు ప్రస్తుతం ఏఎస్ కవిటి గ్రామ తలయరిగా విధులు నిర్వర్తిస్తున్నారు ఇటీవల బ్రతుకు తెరువు నిమిత్తం రెండు ఆటో లను ఫైనాన్స్ మీద కొనుగోలు చేసినట్లు రాబడి లేక సకాలంలో ఫైనాన్స్ డబ్బులు కట్టుకొలేక మనస్తాపానికి గురి అయ్యి గురువారం ఉదయం సుమారు 10.00 గంటల సమయం లో గ్రామ శివారులో చింత చెట్టుకి ఉరి వేసుకొని చనిపోయినట్లు మృతిని భార్య భారతి ఇచ్చిన రిపోర్ట్ మేరకు పాతపట్నం ఎస్ఐ ఎన్. కామేశ్వరరావు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. కామేశ్వరరావు తెలియజేశారు.

విద్యాశాఖ వింత పోకడలు - ఊరిస్తున్న ఉపాధ్యాయుల ప్రమోషన్ల బదిలీలు

యస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణమూర్తి

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఉపాధ్యాయుల ప్రమోషన్లు బదిలీలపై విద్యాశాఖ ఉపాధ్యాయుల పదోన్నతులపై ఒక స్పష్టమైన వైఖరి లేకుండా ఉపాధ్యాయు నికి నష్టం కలిగించే పదోన్నతుల ప్రక్రియ ప్రారంభిస్తుంది. గత జనవరిలో ప్రమోషన్లని ప్రలోభ పెట్టి, ఉపాధ్యాయులను దూర ప్రాంతాలకు వెళ్లి పనిచేసేలా చేసి, ఆ ప్రమో షన్లు ఇప్పుడు రద్దు చేసింది. వీరందరికీ కొత్తగా కామన్ సీనియార్టీ ప్రకారం ప్రమోషన్ ఇస్తామంటు ప్రకటన చేయడం విడ్డూరంగా ఉందని ఎస్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్వి రమణమూర్తి అన్నారు. ఇక ఎంఈఓ 2 ప్రమోషన్ల విషయానికొస్తే ఆ పదోన్నతు లను స్కూల్ అసిస్టెంట్లు తో నింప కుండా, ఒకే క్యాడర్ అయినటువంటి గ్రేడ్ 2 ప్రధానో పాధ్యా యులతో నింపాలని నిర్ణయించడం, అది ప్రమోషన్ అవుతుందా అని ప్రశ్నించా రు. ప్లస్ టు హైస్కూల్లో ఇంటర్మీడియట్ విద్య బోధించడానికి ఒక ఇంక్రిమెంట్ అదనంగా ఇస్తూ నియమిస్తా మంటున్నారు. ఇవి ప్రమోషన్ల కావు, కేడర్ మారదు అని వివరించారు. అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు పిజిటిలు గా ప్రమోషన్లు ఇచ్చి రెగ్యులర్ ప్రాతిపదికన వీరిని నియమించాలని ఎస్ టి యు పక్షాన కోరుతున్నట్లు తెలిపారు. ఇక బదిలీలకు సంబంధించి విద్యా శాఖ అధికారులు 17వ తేదీన రాష్ట్రస్థాయి సంఘాల నేతలతో సమావేశం జరిపి, బదిలీలపై కొన్ని లీకులు ఇచ్చారు. బదిలీ ఉత్తర్వులు ఒకటి రెండు రోజుల్లో వస్తాయని, ఎవరూ న్యాయస్థానాన్ని ఆశ్రయించవద్దని కోరారు. ఏ వర్గానికి అన్యాయం చేయని విధంగా బదిలీ ఉత్తర్వులు ఉన్నప్పుడు, న్యాయస్థానం ఆశ్రయించి డబ్బులు ఖర్చు చేయడం సామాన్య ఉపాధ్యాయునికి సరదా కాదన్నారు. బదిలీల్లో డీఎస్సీ కోసం కొన్ని ఖాళీలు బ్లాక్ చేస్తామన్నారు. బదిలీల్లో ఖాళీలు బ్లాక్ చేయడం అశాస్త్రీయము. బదిలీల తర్వాత మిగిలిన ఖాళీలు ఎలాగూ వారికె ఉంటాయి. వీటిని బ్లాక్ చేయడం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం గతంలో బదిలీలు చేస్తామని చెబుతూనే, కొన్ని డి ఎస్ సి నియామకాలు మరియు ప్రమోషన్లు ఇచ్చింది. బదిలీలకు వీరి స్థానాలను ఖాళీలు గా చూపించమని చెబుతోంది. మరి రాబోయే ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు ఎలా ఉంటాయో ప్రశ్నార్థకమే అని ఆవేదన చెందారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టమైన వైఖరితో విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కూలిపోయిన రైల్వే అండర్ పాస్‌వే గోడలు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : విశాఖపట్నం రైల్వే డివిజన్ పరిధిలోగల కోటబొమ్మాళి రైల్వే స్టేషన్ పరిధిలో ఉన్న అంట్లవరం రైల్వే క్రాసింగ్ వద్ద, నూతనంగా నిర్మాణం అవుతున్న రైల్వే అండర్ పాస్‌వే కట్టడాలు, గోడలు బుధవారం రాత్రి నేలకూలాయి. బుధవారం రాత్రి ఈదురుగాలులు వీయగా, తేలికపాటి వర్షపు జల్లులు కురిసాయి. దీంతో అంట్లవరం గ్రామం వైపు నుంచి పొలాలు వైపు వెళ్లేందుకు నిర్మాణం అవుతున్న రైల్వే అండర్వే పాస్ గోడలు నేలకొరిగాయి. గత కొద్ది నెలలుగా రోడ్డు కాంక్రీటు పనులు, రెండు వైపులా గోడలు నిర్మాణం జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంకా పూర్తిస్థాయి నిర్మాణాలు జరగక మునుపే, గోడలు కూలిపోవటంపై స్థానికులు పలు రకాలుగా విమర్శలు చేస్తున్నారు. నాసిరకం ముడిపదార్థాలతో నిర్మాణాలు వలన, తేలికపాటి జల్లులకు వర్షం గోడలు కూలటం చిత్రంగా ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే శాఖ ఉన్నతాధికారులు పరిశీలించవలసిందిగా వారు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-కవిటి : కంచిలి మండల పరిధిలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని ట్రాన్స్కో ఏ.ఈ గురవయ్య తెలిపారు.

గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సోంపేట నుండి కంచిలి సబ్ స్టేషన్ కి వచ్చే హెచ్ టి లైన్ల నిర్వహణ, ఎంఎస్ పల్లి సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారులు. వినియోగదారులు సహక రించాలని కోరారు.

జీడి పంటకు మద్దతు ధర కల్పించాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : ఉద్దాన ప్రాంతంలో పండిస్తున్న జీడిపంటకు మద్దతు ధర కల్పించాలని, జీడి పంటపై ఎన్నో కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయని పలాస నియోజకవర్గం జనసేన నాయకులు డాక్టర్ దుర్గారావు అన్నారు. జీడి మద్దతు ధర కల్పించాలని విజయవాడలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస నియోజకవర్గ ఉద్దాన ప్రాంతంలో 8,516 హెక్టార్ల జీడి తోటలు విస్తరించి ఉన్నాయని, సుమారు 25వేల మందికి పైగా జీడి పంటపైన ఆధారపడి జీవిస్తున్నాయని, జీడి పంటపైన ప్రకృతి వైపరీత్యాల వలన, పెట్టుబడులు పెరగడం, దిగుబడులు తగ్గడం, నకిలీ పురుగుల మందులు, ఎరువులు వలన జీడిపంట ఆశలను ఆవిరి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2018 అక్టోబరులో వచ్చిన తిత్లీ తుఫాన్ వలన జీడి, కొబ్బరి పూర్తిగా నాశనమైందన్నారు. జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ 1986 నుంచే రైతులు ఉద్యమాలు చేస్తున్నారన్నారు. పలాస మండలం బొడ్డపాడు, వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి, మందస మండలం రట్టి, బాహడపల్లి గ్రామాల్లో జీడిపిక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2019లో రైతు ప్రభుత్వమని వచ్చిన వైసీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లుగా రైతులకు కనీసం మద్దతు ధర ప్రకటించడంలో విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఏడాది మంత్రి అప్పలరాజు వ్యాపారస్తులకు కొమ్ము కాస్తూ 80కేజీల బస్తాకు వ్యాపారస్తుడు 8వేలు, ప్రభుత్వం వెయ్యి రూపాయలు ఇస్తుందని చెప్పి రైతులను నట్టేట ముంచారని మండి పడ్డారు. రైతులు పండించే జీడి పంటకు కనీస మద్దతు ధర 16వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం కల్పించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై రాహుల్ పాండే సానుకూలంగా స్పందించి జీడిపంటకు మద్దతు ధర కల్పించి, రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

రాధాక్రిష్ణ మృతి పార్టీకి తీరని లోటు

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం తులసిపేట గ్రామానికిచెందిన టీడీపీ నాయకుడు, విశ్రాంతి ఉపాధ్యాయులు అన్నెపు రాధాక్రిష్ణ బుధవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందడంతో కుటుంబసభ్యులుతోపాటు పార్టీకి, ప్రజలకు తీవ్ర విషాదమం తెచ్చిందని, అంతేకాకుండా పార్టీకి తీరని లోటని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం రాధాక్రిష్ణ మృతిచెందాడని తెలుసుకొని వెంటనే తులసిపేట గ్రామానికి వెళ్ళి ఆయన పార్థవదేహానికి పూలమాలలవేసి నివాలులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యుల ఓదార్చి పార్టీ మీ కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. అనంతరం మాట్లాడుతూ రాధాక్రిష్ణ ఉపాధ్యాయులుగా ఎంతో మందికి విద్యాబుద్దులు నేర్పించి, శిషాంగ ఉన్నతకి ఎంతో కృషిచేశారని, అనంతరం టీడీపీ పార్టీలో చేరి పార్టీ కోసం చాలా కష్టపడ్డారని అయన మృతి పార్టీకి తీరనిలోటుయని, పార్టీ మంచి కార్యకర్తను కోల్పోయిందన్నారు. ఈయనతో పాటు మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, పార్టీ నాయకుడు గొండు లక్ష్మణరావు పలువురు పార్టీ నాయకులు అన్నెపు రాధాక్రిష్ణ మృతదేహానికి నివాలులర్పించారు.

గాలివాన భీభత్సంతో మామిడి రైతు కుదేలు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మామిడి పంట మరో 10 రోజుల్లో చేతికి వస్తుందని అనుకుంటే బుధవారం రాత్రి కురిసిన గాలివాన భీభత్సంతో మండలంలోని మామిడి రైతులు కుదేలయ్యారు. గురువారం రాత్రి వీచిన ఈదురు గాలులకు వేలాది ఎకరాల్లో చేతికొచ్చిన పంటలు నేలవాలి రైతులు భారీగా నష్టపోయారు. పెద్దఎత్తున గాలులు విచడంతో చెట్లు విరిగి పడి విద్యుత్ వైర్లు తెగిపోవడంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. మండలంలోని ఊడికలపాడు, కోటబొమ్మాళి, కన్నేవలస, పాకివలస, దంత, కురుడు, లఖందిడ్డి, నిమ్మాడ, మూలపేట, తిలారు, బంజీరుపేట, హరిశ్చంద్రపురం, జీయన్నపేట, యలమంచిలి, కిష్టపురం, బలరాంపురం గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాలలో మామిడి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. మామిడి పంట నేలపాలవ్వడంతో రైతులు అబెదిబోమంటున్నారు. బుధవారం అర్ధరాత్రి కురిసిన గాలివాన వల్ల లక్షల రూపాయిలు నష్టం వాటిల్లిందని మామిడి తోటలను పచ్చగుత్త నిమిత్తం కొనుగోలు చేసిన వ్యాపారులు వాపోతున్నారు. మండలంలో సుమారు 550 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. అలాగే అకాల వర్షాల వల్ల అపరాలు, కూరగాయల పంటలు, మొక్కజొన్న పంటలు తీవ్రగా దెబ్బతిన్నాయి. జీడీ, మామిడి, మినుమ, పెసర, మిరప, చెక్కుడు, బీర, బెండ తదితర పంటలకు నష్టం వాటిల్లిందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా మామిడి రైతులు లక్షలు అప్పలు చేసి మామిడి తోటలను కొనుగోలు చేశామని, వరుణుడు దెబ్బకు తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

క్షణికావేశం వద్దు... ఆలోచనే ముద్దు

విశాలాంధ్ర-శ్రీకాకుళం : క్షణికావేశం వద్దు ఆలోచనే ముద్దని వమరవల్లి డైట్ సైకాలజీ లెక్చరర్ అల్లు అప్పన్న అన్నారు. గత నాలుగు రోజులుగా నూతన ఉపాధ్యాయుల అవురూవ (ఇండక్షన్) శిక్షణలో ఆయన మాట్లాడుతూ కొంతమంది విద్యార్థులు క్షణికావేశంతో తప్పుడు నిర్ణయాలు తీసుకుని నిండు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. తల్లిదండ్రుల కలలను కల్లలగానే మిగుల్చుతున్నారు. వారికి కన్నీరు మిగుల్చుతున్నారు ఇది ఎంతమాత్రం సరికాదు. చదువు అనేది విజ్ఞానాన్ని పెంపొందించే దిశలో సాగాలి తప్ప పరీక్షల్లో వచ్చే మార్కులు కాదు. చదివే చదువు సమాజ ఉద్ధరణకు ఉపయోగపడాలి. ఈ మార్కుల ప్రపంచంలో ప్రతీ ఒక్కరూ పోటీ పడుతున్నారు. తల్లిదండ్రులు కూడా మార్కుల కోసం ఒత్తిడి తేకూడదు. ప్రాథమిక, హైస్కూల్ స్థాయిలో సాధారణ ప్రతిభచూపినవారు కూడా పెద్దయ్యేక ఉన్నత స్థాయికి చేరినవారు ఎంతోమంది ఉన్నారు. మనం చరిత్రను అధ్యయనం చేసినా, మహానుబావుల జీవిత కథలు చదివిన వారు ఎదుర్కొన్న కష్టాలు, నష్టాలు వారు ఎదుర్కొని నిలబడిన క్షణాలు తెలుస్తాయన్నారు. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలకు ఎదైనా సంఘటన జరిగినా ఒక్క క్షణం పాజిటివ్ ధోరణితో ఆలోచన చేయలని తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరక్టర్ ఎం.భారతమ్మ, రీసోర్స్ పర్సన్స్ భానోజీరావు, హిమగిరి, సూర్యనారాయణ, సింహాచలం, ఎస్‌పి అనిత కుమారి, పీఎస్ఎన్ మూర్తి, ఈశ్వరరావులు పాల్గొన్నారు.

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా నర్సింగ్‌లో ఉచిత శిక్షణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా నిరుద్యోగులకు శ్రీకాకుళం నగరంలో నర్సింగ్ (జనరల్ డ్యూటీ అసిస్టెంట్) లో ఉచితంగా నాణ్యమైన శిక్షణ, సర్టిఫికెట్, వసతి సౌకర్యం మరియు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రోజెక్ట్ కోఆర్డినేటర్ బి. సురేష్ ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ సందర్భంగా కోర్స్ పూర్తి చేసినవారికి సర్టిఫికెట్స్ ప్రధానం చెయ్యటం జరిగిందని, ఇప్పటి వరకు 210 మంది నిరుద్యోగ యువతకు నైపుణ్యం కలిగిన శిక్షకులతో అత్యాధునిక సదుపాయాలతో కూడిన స్కిల్లింగ్ ల్యాబ్, డిజిటల్ తరగతులలో శిక్షణ, ప్రైవేట్ హాస్పిటల్ లో ఆన్ జాబ్ ట్రైనింగ్, సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ ఇవ్వటం ద్వారా వివిధ రకాలైన కార్పొరేట్ ఆసుపత్రులలో ఉపాధి అవకాశాలు పొందగలిగారన్నారు. తద్వారా వాళ్ళ యొక్క కుటుంబాలు చాలా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. జీడీఏ కోర్స్‌లో జాయిన్ కావలసిన వారు 19 నుండి 30 సంవత్సరాలు మధ్య వయస్సు కలిగి ఉండాలని, కనీసం పదవ తరగతి పూర్తి చెయ్యాలని, కావున ఆసక్తి కలవారు 6302858816 ఈ నెంబర్ కి సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సిబ్బంది నాగమణి, అనీల్ కుమార్, గిరిధర్, సంతోష్ కుమార్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

యశోదనగర్‌లో పారిశుధ్య కార్యక్రమం

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట పట్టణంలోని యశోదనగర్‌లో కాలువలో పేరుకుపోయిన మట్టి చెత్తా చెదరాలను పంచాయతీ ఈఓ వరప్రసాదరావు పర్యవేక్షణలో గురువారం జెసిబి సహాయంతో పకడ్బందీగా పనులు చేపట్టారు. ఈ సమస్య వల్ల ఎంతో కాలంగా మురికినీరు పారుదల లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులకు అధికారులు, ప్రజాప్రతినిధులు చెక్ పెట్టారు.

అచ్చెన్నాయుడును కలిసిన పలువురు నాయకులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి శాసన సభ్యులు కింజరాపు అచ్చెన్నాయుడు ఉన్నారని సామాజిక మాధ్యమాలు ద్వారా తెలుసుకున్న టెక్కలి నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గురు వారం ఉదయం ఆయనకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలతో అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తమతమ గ్రామాల్లో పార్టీ భలోపేతం చేయాటానికి ఇప్పటినుంచే కష్టపడా లని ఆయన సూచించారు. ఈనెలలో రాజమండ్రి లో జరగనున్న మహానాదు కార్యాక్రమంలో ఎక్కువమంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పట్నాన భాస్కరరావు, దుద్దు ధానయ్య, పల్లి సింహాచలం, కూన జనార్ధన రావులతో పాటు పలు మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు అచ్చెన్నాయుడును మర్యాధ పూర్వకంగా కలిసి తమ సమస్యలు తెలియజేశారు. అంతకు ముందు నరసన్నపేట మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, టెక్కలి మండలం టీడీపీ సీనియర్ నాయకులు ఎల్.ఎల్.నాయుడులు అచ్చెన్నాయుడును తన స్వగ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ పరిస్థితి, అదితర అంశాలను పరిశీలించారు.

పచ్చిరొట్ట విత్తనాలకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

విశాలాంధ్ర-సోంపేట : మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఖరీఫ్‌కుసంబంధించి పచ్చిరొట్ట విత్తనాలకు రైతులు ధరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు. రైతులు ఆధార్‌కార్డు, మొబైల్ నెంబరు ద్వారా ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. జీలుగ 10 కిలోలు 395 రూపాయలు, కట్టెజనుము 10 కిలోలు 420 రూపాయలుగా పేర్కొన్నారు.

జలుమూరులో గడప గడకు మన ప్రభుత్వం

విశాలాంధ్ర-జలుమూరు : రాణా సచివాలయ పరిధి హుస్సేన్ పురం పంచాయతీలో 119వ రోజు గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా బాబాజీ పేట, తమ్మయ్య పేట, తమ్మయ్యపేట కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణ దాస్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యలు అడిగితెలుసుకున్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు. ఈయన వెంట మండల వైసీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

స్పందనపై అధికారుల సమావేశం

విశాలాంధ్ర-సోంపేట : ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సోమవారం మండల కేంద్రంలో నిర్వహించే స్పందన (జగనన్నకు చెబుదాం) కార్యక్రమంపై అధికారులు గురువారం సోంపేటలో సమావేశమై చర్చించారు. ఎంపీడీఓ బి.వి.రమణ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై ఆయాశాఖల వారీగా వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపుదామని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఓ తమరాల సీతారామ్మూర్తి, ప్రత్యేక అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి, తహశీల్దార్ కూర్మారావు, ఎంఈఓ జోరాడు, వ్యవసాయాధికారి బి.నర్సింహ మూర్తి, ఎపిఓ బి.ప్రమీల, ఎపిఎం రమణమ్మ, హౌసింగ్ ఎఇ శివరామకృష్ణ, మెడికల్ ఆఫీసర్ హరికిరణ్, పి.శ్రీవందిత, తదితరులు హాజరయ్యారు.

నిరుపేద విద్యార్థినికి చింతామణి ట్రస్ట్ దత్తత

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని గొండ్యాల పుట్టుగ గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని బొర్ర ఝాన్సీ కి హైదరాబాదుకు చెందిన ఇందిరా దేవి, మణికుమార్లు శ్రీ చింతామణి అమ్మవారి ట్రస్ట్ తరుపున దత్తత స్వీకారం చేపట్టారు. నిరుపేద కుటుంబానికి చెందిన బొర్ర ఝాన్సీ ప్రస్తుతం ఎస్ టి జె కాలేజీలో ఆటోనమస్ ఈఈపి గ్రూపులో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్నది. ఝాన్సీ పై చదువులు నిమిత్తం శ్రీ చింతామణి అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ సమక్షంలో 50 వేల రూపాయలు ను ఝాన్సీ తండ్రి ఎర్రయ్యకు స్థానిక సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మండల కోఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్ చేతుల మీదుగా శ్రీ చింతామణి ఆలయ కమిటీ సభ్యులు వెంకట రమణ, ఆరంగి త్రివిక్రమరావు, పొల్లాయి ఉమా మహేష్, జన్ని లోకనాథం సమక్షంలో అందజేశారు.

శాఖా గ్రంధాలయంలో 11వ రోజు శిక్షణా తరగతులు

విశాలాంధ్ర-రణస్థలం : శాఖ గ్రంథాలయంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులలో భాగంగా 11వ రోజు గురువారం దినపత్రికలు చదవడం, కథలు చదివించడం రాయించడం నేర్పించారు. కె భాస్కర రావు ఇంగ్లీష్ స్టోరీ టెల్లింగ్, విశ్రాంతి ఉద్యోగి ఆర్ ధర్మారావులు నీతి కథలు (తెలివైన భార్య, హరిశ్చంద్రుని కథ, తల్లిదండ్రుల గురించి వివరించారు. ఏ మన్మధ రావు హెడ్ కానిస్టేబుల్, విద్యార్థిని విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్ - రోడ్డు దాటేటప్పుడు పాటించవలసిన నియమాలు, దొంగల నుంచి మనకి మనం ఎలా కాపాడుకోవాలో గురించి వివరించారు. తదనంతరం విద్యార్థినీ విద్యార్థులు క్యారమ్స్, పజిల్స్, బిజినెస్ గేమ్, ఆటల్లో పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-మెళియాపుట్టి : మెళియాపుట్టి మండలంలో గల గొప్పిలి గ్రామ సమీపంలో పలాస మండలం లోద్దబద్ర గ్రామానికి చెందిన అట్లు కామేష్ (52) అనే వ్యక్తి బురగన గెడ్డ సమీపంలో మృత్యువాత చెందినట్టు పోలిసులు తెలిపారు వారు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పలాస మండలంలోని లోదబద్ర గ్రామాం నుంచి బుధవారం తమ కుటుంబసభ్యుల వివాహనికి సంబంధించిన పెళ్లి కబుర్ల చెప్పాటాకి వచ్చి మృతి చెందినట్లు తెలిపారు. గురువారం అటు వైపు వెళుతున్న వారు గమనించి పోలీసులుకు సమాచారం అందిచినట్లు తెలుస్తుంది. కామేష్ నాటుసారాను అధికంగా సేవించటంతో వడదెబ్బతగిలి మృతి చెంది ఉండవచ్చునని అనుమానంను వ్యక్తపరుస్తున్నారు. దీంతో అతిగా నాటుసారాను సేవించటం, ఎండ తీవ్రత సైతం అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలి మృతి చెంది ఉండవచ్చునని అనుమానాలువ్యక్తమవుతున్నాయి అయితే వడదెబ్బ తగలటం వల్లనే తన భర్త మృతిచెందినట్లు బార్య రవణమ్మ తెలుపుతుంది. ఎవరిపైనా అనుమానం లేదని అదికంగా ఎండ తీవ్రత వల్ల సమయానికి నీరు దొరకపోవటం వల్ల మృతి చెంది ఉంటాడని లబోదిబుమంటుంది. మృతుడికు భార్య, కుమార్తె కుమారుడు ఉన్నారు. సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలాన్ని తాహశీల్దార్ర్ పి.సరోజిని.సిఐ వినోద్ బాబు,కరజాడ వైద్యుఅధికారి శివ, ఇన్చార్జి ఎస్ఐ కామేశ్వరావు, ఎఎస్ఐ నర్సింగరావు, అర్ఐ వైకుంతరావులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. పోస్టుమార్టం కోరకు పాతపట్నం సిహెచ్సీ కి తరలించినట్లు తెలిపారు. దీన్నిపై కేసునమోదు చేసి దర్యుప్తు చేస్తున్నాట్లు ఎస్ఐ కామేశ్వరరావు తెలిపారు.

విశాఖ-అరకు-బొర్రా గుహలు విహారయాత్ర స్పెషల్

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: ఏపీఎస్ ఆర్టీసీ శ్రీకాకుళం-1, 2 డిపోల వారిచే ఈనెల 27.05.2023 భీమునిపట్నం బీచ్, తిరుమల తిరుపతి దేవాలయం, కైలాసగిరి, అరకు, పద్మావతి గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, కాఫీ హౌస్, బొర్రా గుహలు విహారయాత్రకు సంబంధించి స్పెషల్‌గా సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేయబడిందని, ఈ బస్సు శ్రీకాకుళం బస్సు స్టేషన్ నుంచి ఉదయం 9.00 గంటలకు బయలుదేరి భీమునిపట్నం బీచ్, కైలాసగిరి, తిరుపతి దేవస్థానం దర్శించి, ఎస్. కోట మీదుగా అరుకు వెళ్లి అరకులో రాత్రి బస చేయబడుతుందని శ్రీకాకుళం 1,2 డిపోల మేనేజర్‌లు కెఆర్ఎస్ శర్మ, కె. మాధవరావులు గురువారం తెలిపారు. విహారయాత్రకు సంబంధించి పత్రికను విడుదల చేశారు. విహారయాత్రికులకు అరుకులో లాడ్జింగ్, డిన్నర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, మరుసటి దినం ఉదయం 8 గంటలకు బయలుదేరి పద్మావతి గార్డెన్స్, ట్రైబల్ మ్యూజియం, కాఫీ హౌస్, బొర్రా గుహలు చూపించి సాయంత్రం 6.00 గంటలకు శ్రీకాకుళం బస్ స్టేషన్‌కు చేరవేయబడుతుందన్నారు. దీని కొరకు ఒక్కొక్క ప్రయాణికుడి నుండి రూ.2,500లు ఛార్జ్ నిర్ణయించబడిందని, ఆసక్తి ఉన్న యాత్రికులు ముందుగానే మీ సీటును రిజర్వు చేసుకోగలరని తెలిపారు.

- గోపాలపురం బీచ్ - చిలక సరస్సువిహార యాత్ర.. శ్రీకాకుళం బస్ స్టేషన్ నందు ఉదయం 6.00 గంటలకు బయలుదేరి గోపాలపురం బీచ్ దర్శంపజేసి అక్కడనుండి చిలక సరస్సులో గల ప్రసిద్ధ మహా కాళీ ఆలయాన్ని దర్శింపజేసి మరల సాయంత్రం 6.00 గంటలకు బయలుదేరి శ్రీకాకుళం కాంప్లెక్స్‌నకు చేర్చవేయబడుతుందని, ఈ యాత్రకు సంబంధించి ఒక్కొక్క ప్రయాణికుల నుండి రూ.1500లు చార్జి నిర్ణయించడం జరిగిందని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క విహారయాత్రికలు వినియోగించుకొని మధురానుభూతులను పొందగలరని కోరారు. ఈ కార్యక్రమంలో డీపీటీవో ఏ. విజయ్‌కుమార్, ఏఎం వి. రమేష్, బి. దక్షిణమూర్తి తదితరులు ఉన్నారు.

ఐదు కేజీల గంజాయి... సుమారు రూ. 25 వేలు

విశాలాంధ్ర, పలాస : పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల పల్సర్ వాహనం నుంచి జారిపడి ఐదు కేజీల గంజాయి బ్యాగ్ పోలిసులకు పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే ఇద్దరు వ్యక్తులు పల్సర్ వాహనం పై రెండు బ్యాగ్ లతో అతి వేగంగా ఎక్కడి నుంచో పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వచ్చారు. వెంటనే అక్కడ నుంచి తిరిగి వెళ్ళిపోతుండగా చిన్న బ్యాగ్ వాహనం పై నుంచి జారిపోగా అక్కడ ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు బ్యాగ్ జారిపోయింది చెబుతున్నా పట్టించు కాకుండా మరింత వేగంతో గుర్తు తెలియని వ్యక్తులు పరారయ్యారు. అయితే జారిపోయిన బ్యాగ్ ను పట్టుకొని ఆర్టీసీ ఉద్యోగులు ఆర్టీసీ డిపో అధికారులను అందించారు. తీరా బ్యాగ్ తెరిచి చూస్తే సరికి గంజాయి అని తేలింది. దీంతో ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ఆర్టీసీ సిఐ సంతోష్ కుమార్ కాశీబుగ్గ పోలీసులు, కాశీబుగ్గ ఎక్సైజ్ పోలిసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ సీఐ కృష్ణారావు, పోలిసులు దొరికిన గంజాయిని అదుపులో తీసుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ 25 వేలు విలువ ఉంటుందని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కాశిబుగ్గ పోలీసులు తెలిపారు.

వృద్ధుడుడి సీతయ్యపౌండేషన్ ఆశ్రయం

విశాలాంధ్ర-సోంపేట : దక్షత లేక అనాధగా మిగిలిపోయిన కొత్తపల్లి నరసింహమూర్తి (67) అనే వృద్ధుడు దిక్కు తోచక కవిటి గ్రామానికి చేరుకున్న వయోవృద్ధుడు గుడి, విశ్రాంత ప్రాంగణాల్లో కాలం వెళ్లదీస్తున్నపరిస్థితిని మానవతా దృక్పదంతో చలించి గురువారం సీతయ్య ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వృద్ధుడుకు అన్నదానం, వస్త్రదానం సేవలు అందించి ఆశ్రయం కల్పించారు. వృద్ధుడు సమచారాన్ని ఆశ్రమ నిర్వాహకులకు అందించి తోడుగా నిలిచిన వైద్యులు పూడి రామారావు, బివికె పాఠశాల ఉపాధ్యాయులు సతీష్‌కు ధన్యవాదాలు సీతయ్య ఫౌండేషన్ నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

రైతులకు ఉపయోగపడేలా పనులు

విశాలాంధ్ర-జలుమూరు : రైతులకు ఉపయోగపడేలా ఉపాధి హామీ పథకం పనులను చేపట్టాలని జలుమూరు ఎంపీపీ వాన గోపి ఉపాధి హామీ పథకం వేతనదారులకు సూచనలు చేశారు. మండలంలోని అక్కురాడ, తలతరియ, కొండ కామేశ్వరపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. చెరువులు, సాగునీటి కాలువలు రైతులకు ఉపయోగపడేలా మెరుగుపరచాలని సూచనలు చేశారు. వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా పనులు చేయాలని తెలియజేశారు.

కిట్టాలపాడు వంతెన పునరుద్దరించండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-హిరమండలం: మండలం లోని కిట్టాలపాడు గ్రామం వద్ద గల వంశ దార కుడి ప్రధాన కాలువపై శిదిలావస్తలో ఉన్న వంతెనను పునఃరుద్దరించాలని పాత పట్నం నియోజక వర్గ శాసన సభ్యురాలు రెడ్డి శాంతి గురువారం వంశ దార అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాంతి మాట్లాడు దుతూ దాదాపుగా 35 ఏళ్ళుగా వంశ దార కుడి ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన పూర్తిగా పాడై పోయిందని, ఉన్న ఫలంగా వంతెన కూలిపోతే పూర్తిగా రాక పోకలు స్తంబిస్తాయని ఈ ఒక్క వొంతేనే మీద నుంచే ట్రాక్టర్‌లు, వ్యాన్‌లు లారీలు, ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయని ముందుగా మేల్కొని ప్రక్కన ఇంకో వంతెన నిర్మించితీరాలని తెలిపారు. వంశధార అధికారులు ఈఈ, డిఈ, ఏఈలు పాల్గొన్నారు.

యువజన సంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని కుసుంపురం గ్రామానికి చెందిన మాతృమూర్తి యువజన సేవా సంఘం సభ్యులు ఆధ్వర్యంలో గురు వారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా యువజన సంఘ నూతన కార్యవర్గమును ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ మేరకు గౌరవ అధ్యక్షుడుగా జగదీష్ చంద్ర పట్నాయక్,సలహాదారులుగా నల్లా సుజాత, అధ్యక్షుడుగా జుత్తు చలపతి,ఉపాధ్యక్షుడుగా కుర సాహు,కార్యదర్శిగా అంగ సురేష్,సహాయ కార్యదర్శిగా ఈరోతు కేశవరావు,కోశాధికారిగా మోహన్ దొళాయి,సహాయ కోశాధికారిగా కీలు రవి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు ప్రమాణ స్వీకారం చేపట్టారు.

కొనసాగుతున్న ఏపీ ఈఏపీ సెట్

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈఏపీ సెట్ కొనసాగుతోంది. జిల్లాలో మూడు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నెల 15వ తేదీ నుంచి జరుగుతున్న ఈ పరీక్షలు ఈనెల 19వ తేదీతో ముగుస్తాయి. మూడు కేంద్రాల్లో కలిసి మొత్తం రెండు షిప్టుల్లో 4884 మంది హాజరుకావల్సిఉండగా, 4704 మంది రాశారు. అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 22, 23 తేదీల్లో సెట్ జరగనుంది.

20న ఏపీ గురుకులాల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాల/కళాశాలల్లో ప్రవేశానికి ఈ నెల 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎంపురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త పి.శ్రీనివాసరావు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 20 ఉదయం 10 నుంచి 12 గంటలకు, ఇదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఇంటర్మీడియట్, డిగ్రీలో ప్రవేశానికి పరీక్ష జరుగుతుందని చెప్పారు. దరఖాస్తు చేసిన విద్యార్థులు నిర్దేశించిన సమయానికి గంట ముందు హాజరుకావాలన్నారు. అలాగే అదే రోజు దుయం 6,7,8 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీ పరీక్ష జరుగుతుందని చెప్పారు.

స్పందన కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలి : ఎంపీపీ దాసు

విశాలాంధ్ర-సోంపేట : మండలంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని మరింత పటిష్టంగా నిర్వహించాలని ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు ఎంపీడీఓ బి.వి.రమణను కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓతో ఈ విషయమై చర్చించారు. ప్రతి గ్రామంలో తాగునీరు, శానిటేషన్, వీధిలైట్లు మొదలైన సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఆయా శాఖల అధికారుల సమన్వయంతో వీలైంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-జలుమూరు : ప్రాణాంతక డెంగ్యూ వ్యాధిపై ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని పెద్దదూగాం మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ సాయి, ఏఎన్ఎం సత్యవతి లు సూచించారు. గురువారం జలుమూరు మండలం పెద్దదంలో డెంగ్యూ వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్రైడే ఫ్రైడే పాటించడం, మురికి నీటిలో లార్వాలను నిర్మూలించడం వంటి ప్రక్రియల ద్వారా డెంగ్యూ వ్యాధిని అరికట్టవచ్చు అన్నారు. ఆశా కార్యకర్తలు జగదాంబ తదితరులు పాల్గొన్నారు.